ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



రాజన్న సిరిసిల్ల

జిల్లా వార్తలు

5★★★

గురువారం 22 ఫిబ్రవరి 2024

మేడారం.. జనసంద్రం

● లక్షలాదిగా తరలివచ్చిన భక్త జనం

8లో..

వస్త్ర పరిశ్రమలో

సంక్షోభాన్ని నివారించాలి

వనం నుంచి జనంలోకి..

● జిల్లాలో తొమ్మిది చోట్ల సమ్మక్క సారలమ్మ జాతర

● తొలిరోజు గద్దెకు చేరుకున్న సారలమ్మ

● దర్శించుకున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ప్రజాప్రతినిధులు

● జిల్లా నుంచి మేడారం బాట పట్టిన భక్తులు



సారలమ్మను గద్దెకు తీసుకొస్తున్న పూజారులు

(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

ఆదివాసీల ఆరాధ్య దైవం సమ్మక్క, సారలమ్మ భక్తుల ఇలవేల్పుగా మారారు. వీరత్వానికి, ధైర్యానికి త్యాగానికి ప్రతీకగా నిలిచిన వనదేవతలను భక్తి పార వశ్యంతో గద్దెలకు స్వాగతించి కొలుస్తారు. రాజన్న సిరిసిల్ల జిల్లా నుంచి తల్లుల దీవెన కోసం వేలాది మంది భక్తులు మేడారం బాట పట్టారు. దూర ప్రాంతాలకు వెళ్లలేని వారికోసం జిల్లాలో తొమ్మిది చోట్ల జాతరల నిర్వహణకు ఏర్పాట్లు చేశారు. జిల్లాలోని తంగళ్లపల్లి మండలం ఓబులాపూర్, మండెపల్లి, కోనరావుపేట మండలం శివంగళపల్లి, వీర్నపల్లి మండలం శాంతినగర్ బానోతు గిరిజన తండా, బాబాయ్ చెరువు తండా, ఇల్లంతకుంట మండలంలోని వంతడ్పుల, కందికట్కూర్, ముస్తాబాద్ మండల కేంద్రాల్లో సమ్మక్క, సారలమ్మ జాతర మొదలైంది.

బుధవారం సమ్మక్క తనయ సారలమ్మను డప్పు చప్పుళ్ల మధ్య వైభవంగా గద్దెకు తీసుకొచ్చి ప్రతిష్ఠించారు. కొన్ని చోట్ల ఒకే రోజు ఉదయం, సాయంత్రం వేళల్లో సమ్మక్క, సారలమ్మను తీసుకొచ్చి గద్దెలపై ప్రతిష్ఠించారు. తొలిరోజు శివంగళపల్లెలో సారలమ్మను ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ దర్శించుకున్నారు. వివిధ చోట్ల ప్రజాప్రతినిధులు అమ్మవారలను దర్శించుకున్నారు. జిల్లాకు చెందిన భక్తులు మూడు రోజుల పాటు అక్కడే ఉండే విధంగా ఏర్పాట్లు కూడా చేసుకున్నారు. గురువారం సమ్మక్కను గద్దెపై ప్రతిష్ఠించనున్నారు. జాతర సందర్భంగా ఇబ్బందులు తలెత్తకుండా పోలీసులు భద్రతా ఏర్పాట్లు చేశారు.

గద్దెకు చేరిన సమ్మక్క సారలమ్మ..

తంగళ్లపల్లి : తంగళ్లపల్లి మండలం ఓబులాపూర్ గ్రామంలో సమక్క సారలమ్మ జాతర బుధవారం ప్రా రంభమైంది. గ్రామం నుంచి సమ్మక్క ఊరేగింపుగా గద్దెకు చేరుకుంది. సాయంత్రం జంపన్న వాగు నుంచి సారలమ్మ గద్దెకు చేరుకోవడంతో జాతర ప్రారంభమైం ది. సమ్మక్క సారలమ్మ గద్దెకు చేరుకోవడంతో సా యంత్రం నుంచి ప్రజలు చేరుకుంటున్నారు. మూడు రోజులపాటు సమ్మక్క సారలమ్మ జాతర కన్నుల పం డువగా కొనసాగనుంది. ఇందులో భాగంగా గురువారం ఎడ్ల బండ్లు తిరుగుతాయని సాయంత్రం బోనాలు ఉంటాయని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. 23వ తేదీన జాతర, అమ్మవార్లకు ఒడి బియ్యం సమిర్పించ నున్నట్లు చెప్పారు. 24వ తేదీన సమక్క సారలమ్మ వన ప్రవేశం చేస్తారని పేర్కొన్నారు. మరోవైపు జాతర సందర్భంగా ప్రత్యేక దుకణాలు వెలిశాయి.

ఎల్లారెడ్డిపేట: మండలంలోని బొప్పాపూర్‌లో సమ్మక్కసారలమ్మ జాతర బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయం కలిశ పూజ, సమ్మక్క గద్దెకు రావడం, తదితర కార్యక్రమాలను అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ నెల 22న సారలమ్మ గద్దెనెక్కడం, 23న బోనా లు, తల్లులకు మొక్కులు చెల్లించుట, మహా అన్నదానం, 24న సమ్మక్కసారలమ్మకు ఒడిబియ్యం, దిష్టికుంభం సమర్పణ, అమ్మవార్ల వన ప్రవేశం కార్యక్రమాలు కొనసాగనున్నాయి. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

వీర్నపల్లి : వీర్నపల్లి మండలం శాంతినగర్‌లో మొదటిరోజు సారలమ్మ అడవి నుంచి గద్దె మీదికి చేరుకుంది. భైండ్ల వారి నృత్యాలు, శివసత్తుల పూనకా లు డప్పుచప్పుళ్ల మధ్య సారలమ్మ వనం నుంచి జనం లోకి వచ్చింది. నేడు సమ్మక్క గద్దెకు చేరుకోనున్నట్లు పూజారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజు నాయక్, దేవేందర్‌నాయక్ పాల్గొన్నారు.

ఇల్లంతకుంట: ఇల్లంతకుంట, వంతడుపుల, కందికట్కూర్‌లో కోయపూజారుల ఆధ్వర్యంలో సారలమ్మను బుధవారం గద్దెకు తీసుకొచ్చారు. గురువారం ఉదయం సమ్మక్క గద్దెకు వస్తుందని నిర్వాహకులు తెలిపారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకున్నట్లు ఉత్సవకమిటీ సభ్యులు తెలిపారు.



ఇల్లంతకుంటలో సారలమ్మను గద్దెకు తీసుకొస్తున్న భక్తులు

హెల్త్ సబ్‌సెంటర్‌కు భూమి పూజ



భూమి పూజ నిర్వహిస్తున్న ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్

వేములవాడ రూరల్, ఫిబ్రవరి 21: వేములవాడ అర్బన్ మండలంలోని రుద్రవరం గ్రామంలో రూ.25 లక్షలతో చేపట్టనున్న హెల్త్ సబ్‌సెంటర్ నిర్మాణానికి ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ బుధవారం భూమి పూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బూర వజ్రమ్మ బాబు, జడ్పీటీసీ మ్యాకల రవి, రుద్రవరం సింగిల్‌విండో ఛైర్మన్ రేగులపాటి కృష్ణదేవరావు, సెస్ డైరెక్టర్ హరిచరణ్‌రావు, స్థానిక తాజా మాజీ సర్పంచ్ ఊరడి రాంరెడ్డి, ఎంపీటీసీ గాలిపెల్లి సువర్ణస్వామి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పిల్లి కనుకయ్య, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఆలయ పునఃప్రతిష్ఠాపనోత్సవాలు



ప్రత్యేక పూజలు చేస్తున్న జడ్పీటీసీ లక్ష్మణ్‌రావు

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 21: ఎల్లారెడ్డిపేట మండలం నారాయణపూర్ ఆంజనేయస్వామి ఆలయ పునః ప్రతిష్ఠాపనోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఉదయం వేద పండితుడు రాచర్ల రఘురామశర్మ ఆధ్వర్యంలోని హోమం, మూల మంత్ర హవనం, ధాన్యాదివాస, పుష్పాదివాస తదితర కార్యక్రమాలు చేపట్టారు. జడ్పీటీసీ లక్ష్మణ్‌రావు, ప్యాక్స్ ఛైర్మన్ కృష్ణారెడ్డి, సెస్ డైరెక్టర్ కృష్ణహరి ప్రత్యేక పూజలు చేశారు. ఈ నెల 22న యంత్ర ప్రతిష్ఠ, విగ్రహ ప్రతిష్ఠ, పూర్ణాహుతి, కుంబాభిషేకం వంటి కార్యక్రమాలను నిర్వహించనున్నారు. నాయకులు నర్సింహరెడ్డి, నర్సయ్య, లక్ష్మీ పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో ముందుకు సాగాలి



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 21: విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో ముందుకు సాగాలని ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ సత్యనారాయణ అన్నారు. బుధవారం ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని ద్వితీయ సంవత్సరం విద్యార్థుల వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ సత్యనారాయణ మాట్లాడుతూ విద్యార్థులు పట్టుదలతో చదివి ఉన్నతంగా ఎదగాలన్నారు. ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగి ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. జాతీయ సేవా పథకంలో పాల్గొన్న విద్యార్థులకు ధృవీకరణ పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు పర్శరాములు, చంద్రమౌళి, విష్ణుప్రసాద్, సాగర్, భూమక్క, గీత, గౌతమి, ప్రవళిక తదితరులు పాల్గొన్నారు.

జాతరలో అక్రమాలకు అడ్డుకట్ట వేయాలి

తంగళ్లపల్లి ఫిబ్రవరి 21: తంగళ్లపల్లి మండలం ఓబులాపూర్‌లో సమక్క సారలమ్మ జాతరలో అక్రమాలకు అడ్డుకట్ట వేసి సంచార జాతుల కులాలు జాతరలో అమ్మకాలు జరిపించేలా చూడాలని జిల్లా పూసల సంఘం అధ్యక్షుడు ముద్రకోల ఆంజనేయులు అధికారులకు విజ్ఞప్తి చేశారు. సంచార జాతులు జాతరలో దుకాణలు నెలకొల్పి విక్రయాలు జరుపుకోవడానికి నాలుగు గజాల స్థలానికి రూ.2వేలు చెల్లించాలని జాతర నిర్వాహక కమిటీ డిమాండ్ చేస్తుందని పేర్కొన్నారు. ఆర్డీవో, తహసీల్దార్‌లు ఈ విషయంపై స్పందించి సంచార జాతులు ఉచితంగా విక్రయాలు జరుపుకునేలా చూడాలని కోరుతున్నారు.

సారలమ్మను దర్శించుకున్న ఆది శ్రీనివాస్



దర్శించుకుంటున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

కోనరావుపేట, ఫిబ్రవరి 21: కోనరావుపేట మండలం శివంగాలపల్లి గ్రామంలో వన దేవతలైన సమ్మక్క, సారలమ్మను బుధవారం ప్రభుత్వ విప్, వేములవాడ శాసనసభ్యుడు ఆది శ్రీనివాస్ దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నిజామాబాద్ గ్రామంలో పోచమ్మ బోనాల పండుగలో పాల్గొని పోచమ్మ తల్లిని దర్శించుకున్నారు. ఆయన వెంట మాజీ సెస్ ఛైర్మన్ కేతిరెడ్డి జగన్మోహన్ రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఫిరోజ్ పాషా, శివంగాలపల్లిమాజీ సర్పంచ్ సురేష్ యాదవ్, కోనరావుపేట మాజీ ప్యాక్స్ ఛైర్మన్ గంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శిక్షణ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి



ప్రారంభోత్సవంలో అధికారులు, క్రీడాకారులు

సిరిసిల్ల టౌన్, ఫిబ్రవరి 21 : భారత ప్రభుత్వ యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ, కలెక్టర్ అనుమతితో జిల్లా కేంద్రంలో కబడ్డీ శిక్షణ కేంద్రం ఖేల్ ఇండియా సెంటర్‌ను ఏర్పాటు చేసినట్లు జిల్లా యువజన, క్రీడశాఖ అధికారి అజ్మీరా రాందాస్ తెలిపారు. బుధవారం సిరిసిల్ల పట్టణంలోని మినీ స్టేడియంలో కబడ్డీ శిక్షణ కేంద్రం ఖేల్ ఇండియా సెంటర్‌ను డీవైఎస్‌వో రాందాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు, క్రీడాకారులు, యువతల్లో క్రీడా నైపుణ్యం పెంపొందించడం కోసం శిక్షణ కేంద్రం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి దేవత ప్రభాకర్, కబడ్డీ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి తిరుపతి, కార్యదర్శి రాములు, మండల అధ్యక్షుడు బొడ్డు నారాయణ, వాలీబాల్ అసోసియేషన్ మాజీ జిల్లా అధ్యక్షుడు చెన్నమనేని శ్రీకుమార్, సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడు గుడ్ల రవి, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రజల రక్షణకే 'మీ కోసం'

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 21: ప్రజల రక్షణకు పోలీసు శాఖ 'మీ కోసం' కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని సీఐ శశిధర్‌రెడ్డి అన్నారు. ఎల్లారెడ్డిపేట మండలం పదిర గ్రామంలో బుధవారం రాత్రి 'మీ కోసం' కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా సీఐ శశిధర్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామాల్లో ప్రశాంత వాతావరణం చోటు చేసుకునేలా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని అన్నారు. గ్రామంలో అనుమానిత వ్యక్తులు సంచరిస్తే తమకు సమాచారం అందించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐ రమాకాంత్, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్, పదోతరగతి పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

సిరిసిల్ల కలెక్టరేట్, ఫిబ్రవరి 21: ఇంటర్మీడియెట్, పదో తరగతి పరీక్షల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని ఆయా శాఖల అధికారులను అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్ ఆదేశించారు. ఇంటర్మీడియెట్, పదో తరగతి పరీక్షల నిర్వహణపై కలెక్టరేట్‌లోని చాంబర్‌లో బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరీక్ష కేంద్రాలను శుభ్రం చేయించాలని, తాగునీటి వసతి కల్పించాలని, వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచాలని సూచించారు. వైద్య సిబ్బంది వద్ద మాత్రలు, ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు సిద్ధంగా ఉండాలన్నారు. పరీక్షలు నిర్వహించే రోజుల్లో ఆర్టీసీ వారు బస్‌లను సమయానుకూలంగా నడిపించాలని, సెస్ అధికారులు విద్యుత్ కోతలు లేకుండా చూసుకోవాలని ఆదేశించారు. పరీక్ష పత్రాలు పోలీస్ బందోబస్తు మధ్య తరలించాలని, చీఫ్ సూపరింటెండెంట్ గదిలో సీసీ కెమెరాలు ఉండాలని తెలిపారు. విద్యార్థులు గంట ముందే చేరుకోవాలని, ఇంటర్మీడియెట్ పరీక్షలు ఈ నెల 28వ తేదీ నుంచి మార్చి 19వ తేదీ వరకు నిర్వహించనున్నారని అన్నారు. పరీక్షలు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు నిర్వహిస్తారని వివరించారు. ఫస్ట్ ఇయర్ విద్యార్థులు 4,609 మంది, సెకండియర్ విద్యార్థులు 3934 మంది హాజరు కానున్నట్లు వెల్లడించారు. జిల్లాలోని మొత్తం 18 సెంటర్లలో పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. పదో తరగతి పరీక్షలు మార్చి 18వ తేదీ నుంచి ఏప్రిల్ 2వ తేదీ వరకు నిర్వహించనున్నారన్నారు. పరీక్షలు ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు నిర్వహిస్తారని వివరించారు. మొత్తం విద్యార్థులు 6475 మంది హాజరు కానున్నారని వెల్లడించారు. జిల్లాలోని మొత్తం 35 సెంటర్‌లలో పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. విద్యార్థులు పరీక్ష సమయానికంటే గంట ముందే చేరుకోవాలని, మొబైల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ వస్తువులు వెంట తీసుకురావద్దని సూచించారు. సమావేశంలో డీఈఐవో మోహన్, డీఈవో రమేష్ కుమార్, డీపీవో వీర బుచ్చయ్య మిషన్ భగీరథ ఈఈ జానకి, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ శ్రీరాములు, స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ మహేష్ బాబు, సెస్, పోస్టల్, పోలీస్ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్

మాతృభాషపై విద్యార్థులకు ఆసక్తి కలిగించాలి



సిరిసిల్లలో మాట్లాడుతున్న జూకంటి జగన్నాథం

సిరిసిల్ల రూరల్, ఫిబ్రవరి 21: మాతృభాషపై విద్యార్థులకు ఉపాధ్యాయులు మక్కువ కల్పించాలని తెలంగాణ రచయితల వేదిక జాతీయ అధ్యక్షుడు జూకంటి జగన్నాథం కోరారు. మాతృభాషా దినోత్సవం సందర్భంగా సిరిసిల్ల పట్టణంలోని సినారె జిల్లా గ్రంథాలయంలో బుధవారం మానేరు రచయితల సంఘం అధ్వర్యంలో మాతృభాషపై కవిసమ్మేళనాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కవి, రచయిత గుండెల్లి వంశీకృష్ణ రచించిన ఇంద్రధనస్సు కవితా సంపుటిని జూకంటి జగన్నాథం ఆవిష్కరించారు. మాతృభాషపై పాఠశాలల విద్యార్థులు, కవులు కవిత గానం చేశారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో జూకంటి జగన్నాథం మాట్లాడుతూ నేటితరం పిల్లలు సెల్‌ఫోన్‌లకు అంకితం అవుతున్నారన్నారు. పిల్లల్లో సాహిత్యాన్ని పెంపొందించాలన్నారు. కార్యక్రమంలో మారసం అధ్యక్షుడు టీవీ నారాయణ, ప్రధాన కార్యదర్శి అడెపు లక్ష్మణ్, గుండెల్లి వంశీకృష్ణ, దూడం గణేష్, కొలిపాక శోభారాణి, సౌమ్య, ఉపాధ్యాయులు ఎలగొండ రవి, దేవరాజం పాల్గొన్నారు.

రోడ్డు మరమ్మతు పనులు ప్రారంభం

చందుర్తి, ఫిబ్రవరి 21: జగిత్యాల జిల్లా భీమారం మండలం మోత్కురావుపేట నుంచి రాజన్న సిరిసిల్ల జిల్లా చందుర్తి మండల కేంద్రానికి చేపట్టిన రోడ్డు మరమ్మతు పనులను జడ్పీటీసీ నాగం కుమార్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ వేములవాడ రాజరాజేశ్వరస్వామి ఆలయంలో వచ్చే నెల నిర్వహించనున్న మహాశివరాత్రి జాతర సందర్భంగా భక్తుల రాకపోకలకు ఇబ్బంది కలగకుండా ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ సహకారంతో పనులు ప్రారంభించినట్లు చెప్పారు. కొన్నేళ్లుగా జగిత్యాల జిల్లాతోపాటు రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రాంత ప్రజలకు సౌకర్యవంతమైన రవాణా సౌకర్యం కల్పించేందుకు ఎమ్మెల్యే సహకారంతో త్వరలో రోడ్డు మరమ్మతు పనులను పూర్తి చేయనున్నట్లు తెలిపారు. శివరాత్రికి వేములవాడకు వచ్చే భక్తులకు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు చింతపంటి రామస్వామి, ధర్మపురి శ్రీనివాస్, పులి సత్తయ్య పాల్గొన్నారు.



పనులు ప్రారంభిస్తున్న జడ్పీటీసీ నాగం కుమార్

'బంగారం'(బెల్లం) కోసం భక్తుల తిప్పలు

- ఆధార్ వివరాలు నమోదు

- బెల్లంకు బదులుగా చక్కెరతో తులాభారం



సిరిసిల్లలో బెల్లం విక్రయాలు

(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

సమ్మక్క, సారలమ్మల దర్శనాలు మొదలయ్యాయి. రాజన్న సిరిసిల్ల జిల్లా నుంచి వేలాది మంది భక్తులు మేడారం బాట పట్టారు. దూర ప్రాంతానికి వెళ్లలేని వారు జిల్లాలో జరుగుతున్న సమ్మక్క, సారలమ్మ జాతరల్లో మొక్కులు చెల్లించుకుంటున్నారు. ఈ సారి కూడా ఎక్సైజ్ శాఖ బంగారంగా భావించే బెల్లాన్ని కొనుగోలు చేయడానికి నిబంధనలు కొనసాగించింది. వన దేవతలకు మొక్కులు చెల్లించేందుకు బెల్లం కోసం భక్తులు ఆధార్ నంబరుతోపాటు పూర్తి వివరాలు ఇస్తేనే బెల్లాన్ని వ్యాపారులు విక్రయిస్తున్నారు. ఎక్సైజ్ శాఖ గుండుంబా తయారీకి బెల్లం కొనుగోలు చేస్తారనే నేపథ్యంలోనే వివరాలు సేకరిస్తున్నట్లు తెలుస్తోంది. మరోవైపు రెండేళ్లకు ఒకసారి వచ్చే సమ్మక్క, సారలమ్మకు నిలువెత్తు తులాభారంగా బెల్లాన్ని అమ్మవారికి సమర్పిస్తారు. దీంతో జిల్లాలో ప్రత్యేక బెల్లం విక్రయ దుకాణాలు వెలిశాయి. కిలో రూ.30 నుంచి రూ.40 వరకు అమ్మకాలు జరుగుతున్నాయి. మరోవైపు సమ్మక్క, సారలమ్మ జాతరకు వెళ్లే భక్తులు ముందుగా జిల్లాలోని వేములవాడ రాజరాజేశ్వర స్వామిని దర్శించుకునే అనవాయితీ ఉంది. రాజరాజేశ్వర స్వామికి కోడెమొక్కు, రాజరాజేశ్వర దేవి అమ్మవారికి ఒడి బియ్యం, బద్దిపోచమ్మకు బోనాలు, సమర్పించుకొని మేడారం వెళ్తుండడంతో వేములవాడ దేవస్థానం భక్తులతో కిటకిటలాడుతోంది.



ఆధార్ నిబంధనల ఫ్లెక్సీ

బెల్లానికి బదులుగా చక్కెర

సమ్మక్క, సారలమ్మకు నిలువెత్తు బంగారంగా బెల్లాన్ని ఇవ్వడం అనవాయితీ. బెల్లం వినియోగం తక్కువగా ఉండడంతో వాటిని పంచడానికి కూడా భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో నిలువెత్తు బంగారంలో సగం చక్కెర, మరో సగం బెల్లాన్ని తూకం వేసి పంచుతున్నారు. దీంతో బెల్లం, చక్కెర కొనుగోళ్లు

దుబాయ్ ఫ్యాషన్ షోకు సిరిసిల్ల చీర

- పట్టుచీరపై సోషల్ మీడియా లోగోలు



పట్టుచీరతో విజయ్

సిరిసిల్ల, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి):సిరిసిల్ల చేనేత కళాకారులు ప్రతిభ ఖండాంతరాలు దాటుతోంది. దుబాయ్ ఫ్యాషన్‌షోలో సిరిసిల్ల పట్టుచీర మెరవనుంది. 'ఆన్‌లైన్ సారీ' పేరుతో సోషల్ మీడియా లోగోలతో తయారైన పట్టుచీర అందరినీ ఆకర్షిస్తోంది. రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రానికి చెందిన చేనేత కళాకారుడు నల్ల విజయ్ మరమగ్గంపై ఆన్‌లైన్ సారీని నేశాడు. హైదరాబాద్‌కు చెందిన ఫ్యాషన్ డిజైనర్ శ్రీ వైష్ణవి ఆర్డర్ మేరకు 48 ఇంచుల వెడల్పు, 5.50 మీటర్ల పొడవు ఉన్న పట్టు చీరను తయారు చేశాడు. 600 గ్రాములు ఉన్న పట్టు చీరపై ఫేస్‌బుక్, ట్విట్టర్, యూట్యూబ్, స్నాప్‌చాట్ వంటి సోషల్ మీడియా లోగోలు నేశాడు. ఈ నెలలో దుబాయ్‌లో జరిగే ఫ్యాషన్‌షోలో చీరను ప్రదర్శించనున్నారు. విజయ్ ఇప్పటికే అగ్గిపెట్టెలో అమిరె చీరలు, కుట్టు లేని వస్త్రాలు, బంగారం, వెండితో చీరలను తయారు చేశాడు. తెలంగాణ ప్రభుత్వం నుంచి అవార్డులు అందుకున్నాడు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం


సతీష్ (ఫైల్)

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 21: మండలంలోని బొప్పాపూర్ గ్రామశివారులోని కామారెడ్డి- సిరిసిల్ల ప్రధాన రహదారిపై బుధవారం ఇసుక ట్రాక్టర్, ద్విచక్రవాహనం ఢీకొన్నాయి. ఈ సంఘటనలో వీర్నపల్లి మండలం బావుసింగ్‌నాయక్‌తండాకు చెందిన యువకుడు భూక్య సతీష్(22) అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యాడు. అదే తండాలోని యువకుడు భూక్య సాయికుమార్ తీవ్రగాయాలయ్యాడు. ఎస్ఐ రమాకాంత్ కథనం మేరకు.. వీర్నపల్లి మండలం బావుసింగ్‌నాయక్‌తండాలోని భూక్య మంజుల- రాజు దంపతుల ఒక్కాగానొక్క కొడుకు సతీష్ ఎలక్ట్రిషియన్‌గా పనులు చేస్తుండేవాడు. బుధవారం ఉదయం తన ద్విచక్రవాహనం పై స్నేహితుడు సాయికుమార్‌తో కలిసి ఇంటి నుంచి గొల్లపల్లికి బయలుదేరారు. బొప్పాపూర్ గ్రామ శివారులో ఎదురుగా వస్తున్న ఇసుక ట్రాక్టర్ అతి వేగంగా ఢీకొట్టింది. దాంతో బైక్ ట్రాక్టర్ భాగంలో చిక్కుకుపోయింది. సతీష్ అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్రగాయాల పాలైన సాయికుమార్ పరిస్థితి విషమంగా మారింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సిరిసిల్ల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడి తల్లి మంజుల ఫిర్యాదు మేరకు మండలంలోని తిమ్మాపూర్ గ్రామానికి చెందిన ఇసుక ట్రాక్టర్ డ్రైవర్ ఆలకుంట శివపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని ఎస్ఐ రమాకాంత్ వివరించారు.

● వారంలో గల్ఫ్ దేశానికి.. అంతలోనే అనంత లోకాలకు..

వీర్నపల్లి మండలం బావుసింగ్‌నాయక్‌తండాలోని యువకుడు భూక్య సతీష్ వారం రోజుల్లో గల్ఫ్ దేశానికి వెళ్లేందుకు సిద్ధమవుతున్న క్రమంలో అతన్ని విధి రోడ్డు ప్రమాదం రూపంలో బలితీసుకుంది. కన్న కొడుకు గల్ఫ్ దేశానికి పయనమవుతున్న తరుణంలో అనంత లోకాలకు వెళ్లడంతో కుటుంబంలో విషాద ఛాయలు నెలకొన్నాయి. తండాలోని మంజుల-రాజు దంపతులు కొడుకు సతీష్. రాజు రెండు నెలల కిందట గల్ఫ్ దేశానికి వలస వెళ్లాడు. కొడుకును గల్ఫ్ తీసుకునేందుకు అన్ని ఏర్పాట్లు చేసుకున్నారు. వారం రోజుల్లో పయనమవుతాడనుకున్న కొడుకు తిరిగి రాని లోకాలకు వెళ్లడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా రోదించారు. మృత వార్త తెలుసుకున్న తండ్రి రాజు స్వగ్రామానికి తిరిగి వస్తున్నాడని కుటుంబ సభ్యులు తెలిపారు.


ట్రాక్టర్ కింద భాగంలో చిక్కుకున్న బైక్

ఉరి వేసుకుని వృద్ధుడి ఆత్మహత్య

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 21: రెండు రోజుల కిందట అదృశ్యమైన వృద్ధుడు నేవూరి చంద్రారెడ్డి(60) తన ఇంటి సమీపంలోని పాడు పడిన పశువుల పాకలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడడంతో ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో బుధవారం విషాదం నింపింది. ఎస్ఐ రమాకాంత్ కథనం మేరకు.. గ్రామంలోని చంద్రారెడ్డి ఇటీవల అనారోగ్యానికి గురవడంతో ఈ నెల 18న కరీంనగర్ ఆసుపత్రికి తరలించి చికిత్స చేయించి సాయంత్రం ఇంటికి చేరుకున్నారు. ఈ నెల 19 ఉదయం నిద్రలేచే సరికి వృద్ధుడు చంద్రారెడ్డి కనిపించకుండాపోయాడు. బంధువులు, చుట్టు పక్కల ఆరా తీసిన ఆచూకీ లభించలేదు. దాంతో తమ మామ కనిపించడం లేదని పేర్కొంటూ కోడలు అనురాధ ఈ నెల 20న ఫిర్యాదు చేయడంతో పోలీసులు అదృశ్యం కేసు నమోదు చేశారు. అనారోగ్యంతో బాధపడుతూ జీవితంపై విరక్తి చెందిన చంద్రారెడ్డి తన ఇంటి సమీపంలోని పశువుల పాకలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అటు వైపు వెళ్లిన స్థానికులకు దుర్వాసన రావడంతో గమనించి స్థానిక పోలీసులకు సమాచారం అందించారు. ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని సిరిసిల్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ రమాకాంత్ వివరించారు.

క్రమశిక్షణ, చట్టాలపై అవగాహన ఉండాలి

- అడిషనల్ డీజీ రైల్వేస్ మహేష్ ఎం భగవత్ - పీటీసీ, సీటీసీల్లో కానిస్టేబుల్ శిక్షణ ప్రారంభం



మాట్లాడుతున్న మహేష్ భగవత్, అభిషేక్ మొహంతి, శిక్షణకు హాజరైన కానిస్టేబుల్ అభ్యర్థులు

కరీంనగర్ క్రైం, ఫిబ్రవరి 21: పోలీసుశాఖలో కానిస్టేబుల్ ఉద్యోగం పొందినవారు క్రమశిక్షణ, చట్టాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని అడిషనల్ డీజీ రైల్వేస్ మహేష్ ఎం భగవత్ అన్నారు. పోలీసుశాఖలో కానిస్టేబుల్ ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులకు కరీంనగర్‌లోని పోలీసు శిక్షణ కళాశాల(పీటీసీ), సిటీ పోలీసు శిక్షణ కేంద్రం (సీటీసీ)లో బుధవారం నుంచి శిక్షణ ప్రారంభమైంది. ఈ శిక్షణను రాంనగర్‌లోని పీటీసీలో అడిషనల్ డీజీ రైల్వేస్ మహేష్ ఎం భగవత్ ప్రారంభించగా, ఉజ్వల పార్క్ వద్ద సీటీసీలో పోలీస్‌కమిషనర్ అభిషేక్ మొహంతి ప్రారంభించారు.

ఈ సందర్భంగా అడిషనల్ డీజీ రైల్వేస్ మహేష్ ఎం భగవత్ మాట్లాడుతూ అభ్యర్థులు శిక్షణ సమయంలో ఏకాగ్రతతో నేర్చుకున్నట్లయితే ఉద్యోగం సమయంలో సమర్థవంతంగా పనిచేయగలుగుతారన్నారు. పోలీసు ఉద్యోగం అనేది ఒక బాధ్యతాయుతమైనదన్నారు. సమాజంలో రోజురోజుకు నేరాలు పెరుగుతున్నాయని, సైబర్ నేరాలు నియంత్రణ కోసం సాంకేతిక పరిజ్ఞానంపై పట్టుసాధించాలన్నారు. రాంనగర్‌లోని పీటీసీలో హైదరాబాద్, రాచకొండ, సైబారాబాద్, నల్గొండ, గద్వాల నుంచి 675 మంది కానిస్టేబుల్ అభ్యర్థులు శిక్షణకు హాజరయ్యారు. వీరందరికీ 9 నెలలపాటు ఇక్కడే శిక్షణ ఇవ్వనున్నారు. కార్యక్రమంలో పీటీసీ ప్రిన్సిపాల్ ఎస్ శ్రీనివాస్, డీఎస్‌పీలు మల్లికార్జున్, విజయపాల్‌రెడ్డి, శ్రీనివాస్, మోహన్, సిబ్బంది పాల్గొన్నారు.

● ప్రజలకు సేవచేసే అవకాశం అధికం: సీపీ

ఇతర ప్రభుత్వ శాఖలకంటే పోలీసు శాఖ ద్వారా ప్రజలకు సేవచేసే అవకాశం అధికమని కరీంనగర్ పోలీస్‌కమిషనర్ అభిషేక్ మొహంతి అన్నారు. కరీంనగర్ సీటీసీలో సంగారెడ్డి జిల్లాకు చెందిన 235 మంది కానిస్టేబుల్‌గా ఎంపికైన అభ్యర్థులకు శిక్షణను బుధవారం సీపీ ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న 30 సంవత్సరాల పాటు పోలీసుశాఖ తరఫున ప్రజలకు సేవలు అందించే బాధ్యత ఉంటుందన్నారు. పోలీసు ఉద్యోగం చేయాలంటే ఫిజికల్ ఫిట్‌నెస్ ముఖ్యమని, శిక్షణలో కరీంనగర్ మొదటి స్థానంలో ఉండాలన్నారు. కార్యక్రమంలో సీటీసీ ప్రిన్సిపాల్ అడిషనల్ డీసీపీ ఏ లక్ష్మీనారాయణ, ఏసీపీ వేణుగోపాల్, ఏఆర్ ఏసీపీ ప్రతాప్, అధికారులు పాల్గొన్నారు.

మహాశివరాత్రి జాతర ఏర్పాట్లు త్వరగా పూర్తి చేయాలి

- అదనపు కలెక్టర్ గౌతమి



జాతర ఏర్పాట్లు పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ గౌతమి

వేములవాడ, ఫిబ్రవరి 21: మహాశివరాత్రి జాతర ఏర్పాట్లు త్వరగా పూర్తి చేయాలని రాజన్న సిరిసిల్ల జిల్లా అదనపు కలెక్టర్ గౌతమి ఆలయ అధికారులను ఆదేశించారు. మహాశివరాత్రి జాతర ఏర్పాట్లను బుధవారం ఆమె క్షేత్రస్థాయిలో పరిశీలించారు. జాతర ఏర్పాట్లలో అలసత్వం వహించవద్దని, పనుల్లో వేగం పెంచాలని అధికారులకు, సిబ్బందికి సూచించారు. జాతర సందర్భంగా భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చూసేందుకు సమన్వయ కమిటీ సమావేశంలో తీసుకున్న నిర్ణయాల ప్రకారం ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. తాగునీరు, పారిశుధ్యం, క్యూలైన్ల నిర్వహణ, భద్రతా ఏర్పాట్లు, పార్కింగ్ ఏర్పాట్లు తదితర పనులపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. అదనపు కలెక్టర్ వెంట ఆలయ ఈవో కృష్ణప్రసాద్, ఈఈ రాజేష్, మున్సిపల్ కమిషనర్ అన్వేష్, ఆలయ ప్రొటోకాల్ పర్యవేక్షకులు శ్రీరాములు, ఎడ్ల శివ ఉన్నారు.

రాజన్న సేవలో నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే

వేములవాడ ఫిబ్రవరి 21: వేములవాడ రాజరాజేశ్వర స్వామివారిని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి దర్శించుకున్నారు. బుధవారం నాడు ఆయన కుటుంబ సమేతంగా కోడె మొక్కు చెల్లించుకుని స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాగిరెడ్డి మండపంలో ఆలయ అర్చకులు ఆశీర్వచనం గావించగా, ఆలయ సూపరింటెండెంట్ అల్లి శంకర్ స్వామివారి ప్రసాదం అందజేశారు. ఆలయ ప్రొటోకాల్ సూపరింటెండెంట్ సిరిగిరి శ్రీరాములు ఆయన వెంట ఉన్నారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి

గంగాధర, ఫిబ్రవరి 21: బతుకు దెరువుకోసం వచ్చిన ఓ యువకుడు మేస్త్రీ పని చేస్తుండగా ప్రమాదవశత్తు విద్యుదాఘాతంతో మృతి చెందిన ఘటన మండలంలోని గర్శకుర్తిలో బుధవారం జరిగింది. ఎస్ఐ అభిలాష్ తెలిపిన వివరాల ప్రకారం నెల్లూరు జిల్లాకు చెందిన చీమలదిన్నె బాలగురవయ్య(26) కొద్ది రోజులుగా గర్శకుర్తిలో భవన నిర్మాణ మేస్త్రీగా పని చేస్తున్నాడు. బుధవారం ఇంటి స్లాబ్‌పై సైడు గోడ కడుతున్నాడు. పక్కనే ఉన్న విద్యుత్ తీగలకు బాలగురవయ్య చేయి తాకి కరెంటు షాక్ మృతి చెందాడు.మృతుడి సోదరుడు శ్రీనివాసులు పిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

- మరొకరి పరిస్థితి విషమం

ముస్తాబాద్, ఫిబ్రవరి 21: మండలంలోని నామాపూర్ గ్రామంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందగా మరోకరు తీవ్రంగా గాయపడ్డారు. గంబీరావుపేట మండలం లింగన్నపేట గ్రామానికి చెందిన దమ్మన్నపేట నర్సింహులు (50), దమ్మన్నపేట దేవయ్యలు (55) ముస్తాబాద్ నుంచి లింగన్నపేట వైపు ద్విచక్రవాహనంపై వెళ్తున్నారు. నామపూర్ గ్రామంలో ఎదురుగా వచ్చిన ట్రాలీఆటో ఢీకోట్టడంతో నర్సింహులు మృతిచెందగా తీవ్రగాయాలైన దేవయ్య సిరిసిల్ల జిల్లా అసుపత్రికి తరలించారు. ఘటన స్థలాన్ని పరిశీలించి పోలీసులు వివరాలు సేకరిస్తున్నారు.

వ్యవసాయబావిలో దూకి వృద్ధుడి ఆత్మహత్య



పప్పు నర్సయ్య(ఫైల్)

మానకొండూర్, ఫిబ్రవరి 21: మండలంలోని చెంజర్ల గ్రామానికి చెందిన పప్పు నర్సయ్య (90) అనే వృద్ధుడు బుధవారం వ్యవసాయబావిలో పడి ఆత్మహత్యకు పాల్పడ్డట్లు సీఐ రాజ్‌కుమార్ తెలిపారు. నర్సయ్య కొంత కాలంగా అనారోగ్యంతో భాదపడుతూ పలు ఆసుపత్రుల్లో వైద్యం చేయించినా నయం కాలేదని తెలిపారు. వ్యాధి నయం కాకపోవడంతో జీవితంపై విరక్తి చెంది గ్రామంలోని వ్యవసాయబావిలో పడి ఆత్మహత్య చేసుకున్నాడని తెలిపారు. కుటుంబసభ్యుల సమాచారం మేరకు సంఘటనా స్థలానికి చేరుకొని బావిలో నుంచి మృతదేహాన్ని బయటికి తీశారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు శవపంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం కరీంనగర్ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఖాతాదారులను మోసం చేసిన అక్షర చిట్‌ఫండ్స్

- చైర్మన్, ఇద్దరు డైరెక్టర్ల అరెస్టు



నిందితులను అరెస్టు చూపుతున్న ఒకటో టౌన్ ఎస్ఐ రవికుమార్

కరీంనగర్ క్రైం, ఫిబ్రవరి 21: ఖాతాదారులకు సకాలంలో డబ్బులు చెల్లించకుండా మోసగించినందుకు, ఖాతాదారుల డబ్బులతో సొంత ఆస్తులు కూడబెట్టుకునందుకు కరీంనగర్‌లోని అక్షర చిట్‌ఫండ్స్‌పై ఇటీవల ఒకటో టౌన్, రెండో టౌన్లల్లో కేసులు నమోదయ్యాయి. ఈ మేరకు అక్షర చిట్‌ఫండ్స్ చైర్మన్ పేరాల శ్రీనివాసరావు, ఇద్దరు డైరెక్టర్లు సూరినేని కొండలరావు, ఉప్పల రాజేందర్‌ను ఒకటో టౌన్ పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. మరో ముగ్గురు డైరెక్టర్లపై కేసు నమోదైంది. ఒకటో టౌన్ పోలీసుల వివరాల ప్రకారం.. చిట్ డబ్బులు సభ్యులకు చెల్లించకుండా మోసం చేసినందుకు ప్రొటెక్షన్ ఆఫ్ డిపాజిట్స్ ఆఫ్ ఫైనాన్సియల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్-1999 సెక్షన్ 3, 4 ప్రకారం నిందితులపై ఐపీసీ సెక్షన్ 406, 420 రెడ్‌విత్ 34, 5 కింద అక్షర చిట్‌ఫండ్స్ చైర్మన్, ఐదుగురు డైరెక్టర్లపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. కరీంనగర్ రూరల్ మండలం సీతారాంపూర్‌కు చెందిన రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగి శ్రీరాం వెంకట్‌రెడ్డి అక్షర చిట్‌ఫండ్స్‌లో రూ.7 లక్షల చిట్ వేశాడు. చిట్ గడువు ముగిసినప్పటికీ డబ్బులు చెల్లించకుండా చిట్‌ఫండ్స్ యాజమాన్యం ఇబ్బందులకు గురిచేశారు. బాధితుడు ఒకటో టౌన్లో ఫిర్యాదు చేశాడు. హన్మకొండలోని సుబేదారి, వడ్డేపల్లి ఎక్స్‌రోడ్ ఎస్‌బీహెచ్ కాలనీకి చెందిన పేరాల శ్రీనివాసరావు అనే వ్యక్తి తిరుపతిరెడ్డి అనే వ్యక్తితో కలిసి హన్మకొండలో అక్షర చిట్ ఫండ్స్ సంస్థను ఏర్పాటు చేశారు. ఆ తరువాత తిరుపతిరెడ్డి ఆ సంస్థ నుంచి ఉపసంహరించుకోగా శ్రీనివాసరావు భార్య శ్రీవిద్య, సూరినేని కొండలరావు, ఉప్పల రాజేందర్, అలువల వరప్రసాద్, గోనె రమేష్‌లు డైరెక్టర్లుగా కొనసాగుతున్నారు. అక్షర చిట్‌ఫండ్స్‌కు కరీంనగర్, జగిత్యాల, నిజామాబాద్, బోధన్, ఆదిలాబాద్, పెద్దపల్లి, గోదావరిఖని, మంచిర్యాల, హైదరాబాద్, ఖమ్మం, నల్గొండ, ఇతర పట్టణాలలో 54 బ్రాంచిలు ఉన్నాయి. ఏజెంట్ల నుంచి సభ్యులను చేర్పించుకుని చిట్స్ నిర్వహిస్తున్నారు. ఖాతాదారుల నుంచి సేకరించిన డబ్బులతో ఆ సంస్థ పలు చోట్ల భూములు కొనుగోలు చేసింది. గడువు ముగిసిన సభ్యులకు చిట్ డబ్బులు చెల్లించకుండా, ఆ డబ్బులకు అధిక వడ్డీ చెల్లిస్తామని వారిని నమ్మించి ప్రభుత్వ అనుమతి లేని డిపాజిట్ బాండ్ల రూపంలో బాండ్‌లను ఇస్తూ కాలయాపన చేశారు. బాండ్ల కాలపరిమితి ముగిసినా తిరిగి రెన్యూవల్ చేస్తూ వచ్చారు. ఖాతాదారుల డబ్బులతో వెదిర, వెలిచాలలో అక్షర టౌన్‌షిప్, అక్షర టౌన్‌షిప్ ఇండియా పేరిట 50 ఎకరాల భూమి కొనుగోలు చేశారని, గాడిపల్లి, నగునూర్‌లలో కూడా కొంత భూమి కొనుగోలు చేసినట్లు పోలీసులు తెలిపారు. కరీంనగర్‌లోని నాలుగు బ్రాంచీల్లో 800 మంది సభ్యులను చేర్చుకున్నారని పోలీసులు తెలిపారు. ఈ కేసులో అరెస్టు చేసిన ముగ్గురిని కోర్టులో హాజరుపరచి జడ్జి ఆదేశాలతో 14 రోజుల రిమాండ్‌కు కరీంనగర్ జిల్లా జైలుకు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

హనుమాన్‌నగర్‌లో అగ్నిప్రమాదం

పెద్దపల్లిటౌన్, ఫిబ్రవరి 21: పట్టణంలోని హనుమాన్‌నగర్ లోని ఓ ఇంటిలో బుధవారం భారీ అగ్నిప్రమాదం జరిగింది. ఘటన స్థలానికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను ఆర్పివేశారు. పెంకుటిల్లుకు అంటుకున్న మంటలను అదుపుచేసి పక్కనే గల రెండు గదులకు ప్రమాదం సంబవించకుండా చర్యలు తీసుకున్నారు. సుమారు గంటపాటు శ్రమించి అగ్నిమాపక సిబ్బంది పూర్తిగా మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. ప్రమాదంలో సుమారు నాలుగు లక్షల 50 వేల రూపాయల నష్టం వాటిల్లినట్లు ఫైర్ ఆఫీసర్ దేవనంది శ్రీనివాస్ తెలిపారు. నిత్యావసర వస్తువులు, బంగారం, వెండి, గ్యాస్ సిలిండర్ సర్టిఫికెట్స్ బట్టలు కొంత నగదు, టీవీ, బట్టలు, ఇతర వస్తువులు పూర్తిగా దగ్ధం అయినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది మహమ్మద్ సిరాజుద్దీన్, పి చంద్రయ్య, కె శ్రీనివాస్, పి నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్రవాహనం, సైకిల్ ఢీ: ఒకరి మృతి

జమ్మికుంట రూరల్, ఫిబ్రవరి 21: జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని ఆబాది జమ్మికుంటలో గల పెద్దంపల్లి గ్రామ కమాన్ సమీపంలో ద్విచక్ర వాహనం, సైకిల్ ఢీకొన్న సంఘటనలో దొడ్డె పరుశురాములు (59) మృత్యువాత పడ్డాడు. పెద్దంపల్లి గ్రామానికి చెందిన దొడ్డె పరుశురాములు గ్రామంలోని ఓ శుభకార్యానికి హాజరై తిరిగి ద్విచక్రవాహనంపై జమ్మికుంటకు వస్తున్నాడు. అదే సమయంలో అటువైపు వెళ్తున్న నరసయ్యను ప్రమాదవశాత్తు ఢీకొట్టాడు. ఈ క్రమంలో పరుశురాములు అక్కడికి అక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ వరగంటి రవికుమార్ తెలిపారు.

గుర్తుతెలియని వృద్ధుడి మృతి

కరీంనగర్ క్రైం, ఫిబ్రవరి 21: కరీంనగర్ ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో చికిత్సపొందుతూ సుబ్రమణ్యం(60) అనే వృద్ధుడు మంగళవారం రాత్రి మృతి చెందాడని అవుట్‌పోస్ట్ హెడ్‌కానిస్టేబుల్ ప్రభాకర్ తెలిపారు. ఈ నెల 13న వేములవాడలో చెట్టు పైనుంచి కిందపడి గాయాలు కాగా 108 అంబులెన్స్‌లో తీసుకువచ్చిన కొందరు వ్యక్తులు ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించి వెళ్లినట్లు తెలిపారు. సుబ్రమణ్యం ప్రకాశం జిల్లా దర్శి మండలానికి చెందిన వ్యక్తిగా ఆసుపత్రి రికార్డులో నమోదై ఉందని, మిగతా వివరాలు తెలియరాలేదన్నారు.

కోల ప్రశాంత్‌కు వేములవాడ పోలీసుల పీటీ వారెంట్

కరీంనగర్ క్రైం, ఫిబ్రవరి 21: నకిలీ డాక్యుమెంట్లతో భూకబ్జాలకు పాల్పడి కోటి 37 లక్షలు వసూలు చేసిన కేసులో అరెస్టు అయి కరీంనగర్ జిల్లా జైలులో రిమాండ్‌లో ఉన్న కార్పొరేటర్ భర్త కోల ప్రశాంత్‌ను బుధవారం వేములవాడ పోలీసులు పీటీ వారెంట్‌పై జైలు నుంచి తీసుకువెళ్లారు. కోల ప్రశాంత్‌పై వేములవాడలో రెండు ఎస్సీ, ఎస్టీ, రెండు భూకబ్జా కేసులు నమోదైనట్లు సమాచారం. ఈ కేసుల్లో కోల ప్రశాంత్‌ను నిందితుడిగా కోర్టులో హాజరుపరిచేందుకు పీటీ వారెంట్‌పై తీసుకువెళ్లారు.

● భూకబ్జా, బెదిరింపులకు సంబంధించిన కేసులో అరెస్టు అయి కరీంనగర్ జిల్లా జైలులో ఉన్న మాజీ ఎంపీటీసీ కొమ్ము భూమయ్యను పోలీసులు కస్టడీకి తీసుకున్నారు. విచారణ అనంతరం బుధవారం సాయంత్రం కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసులో భూమయ్యను ఇప్పటికే పోలీసులు రెండుసార్లు కస్టడీకి తీసుకుని ఆయన ఇంటిలో సోదాలు జరిపి పలు కీలక డాక్యుమెంట్లు స్వాధీనం చేసుకోగా మంగళవారం మరోసారి కస్టడీకి తీసుకుని విచారించారు. తీగలగుట్టపల్లిలో భూమయ్య పలు భూకబ్జాలకు పాల్పడినట్లు ఫిర్యాదులు అందాయి. నకిలీ డాక్యుమెంట్లు, స్టాంపులు తయారు చేసి పంచాయతీకార్యదర్శి సంతకాలను ఫోర్జరీ చేసినట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది.

రాజకీయ లబ్ధికోసమే సర్పంచ్‌లపై ఎంపీ మొసలి కన్నీరు



బండి సంజయ్ సర్పంచులకు రాసిన లేఖ ప్రతులను చూపుతున్న జడ్పీ చైర్మన్లు, బీఆర్ఎస్ నాయకులు

కరీంనగర్ టౌన్, ఫిబ్రవరి 21: ఎంపీగా బండి సంజయ్ ఏనాడూ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని ఏ ఒక్క గ్రామాన్ని సందర్శించలేదని, సర్పంచులకు ఎలాంటి ఆర్థిక సహాయం చేయలేదని, ఎన్నికలు సమీపించే సరకి రాజకీయ లబ్ధి కోసం మొసలి కన్నీరు కారుస్తున్నారని కరీంనగర్, హన్మకొండ, జగిత్యాల జడ్పీ చైర్‌పర్సన్లు కనుమల్ల విజయ, డాక్టర్ సుధీర్‌బాబు, ద్యావ వసంత విమర్శించారు. బుధవారం కరీంనగర్‌లో వారు మీడియా సమావేశంలో మాట్లాడారు. ఎంపీ సంజయ్ సర్పంచులకు మీ ఆదరాభిమానాలు ఉండాలని లేఖ రాయడాన్ని తీవ్రంగా ఖండించారు. సర్పంచులు ఐదేళ్ల అధికారంలో ఉండగా ఏనాడూ స్థానిక సంస్థల గురించి, సర్పంచుల సమస్యలపై, గ్రామాల అభివృద్ధికి నిధుల మంజూరును గానీ పట్టించుకోలేదన్నారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో ఓడిపోతామనే భయంతో సర్పంచుల ముందు మొసలికన్నీరు కార్చుతున్నాడని విమర్శించారు. గ్రామాలకు నిధులు మంజూరు చేయాలని పార్లమెంట్‌లో ఏనాడూ సంజయ్ మాట్లాడలేదని, ఆయనకు ఏ భాషపై కూడా పరిజ్ఞానం లేదన్నారు. పార్లమెంట్ సభ్యుడిగా ఆయన పూర్తిగా అనర్హుడని విమర్శించారు. ఉపాధిహామీ పనిదినాలను 13 కోట్ల నుంచి ఏడు కోట్ల పనిదినాలకు తగ్గిస్తే కనీసం గ్రామాల్లో కూలీలకు పని కల్పించాలని ఏనాడూ కోరలేదని అన్నారు. మిషన్ భగీరథ ద్వారా గ్రామాల్లోని ప్రతి ఇంటికి నల్లానీటిని అందించే పథకాన్ని నీతిఆయోగ్ ప్రశంసిస్తూ 24 కోట్ల రూపాయలు రాష్ట్రానికి ఇవ్వాలని రెకమండ్ చేస్తే వాటిని కేంద్రం ఇవ్వలేదని, దీనిపై కూడా సంజయ్ నోరుమెదపలేదని అన్నారు. ఇంటింటికి రాముని ఫొటోలను పంపిణీ చేయడం కాదు, ఎంపీగా ప్రజలకు ఏమి చేశావో చెప్పాలని డిమాండ్ చేశారు. కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని ఒక్క జడ్పీ సమావేశానికి కూడా ఎంపీగా సంజయ్ హాజరు కాలేదన్నారు. వ్యవసాయాన్ని ఉపాధిహామీతో అనుసంధానం చేయాలని మాజీ సీఎం కేసీఆర్ అనేకసార్లు ప్రధానికి లేఖరాస్తే ఎందుకు దానిపై స్పందించలేదని నిలదీశారు. ఇప్పుడు సర్పంచులకు అండగా ఉంటామని చెబుతూ మొసలికన్నీరు కారుస్తున్నారని, ఏ సర్పంచు ఆయనను నమ్మే పరిస్థితిలో లేరని అన్నారు. 15వ ఆర్థిక సంఘం నిధులు తానే తెచ్చానని, రాష్ట్రంలోని అన్ని పథకాల్లో కేంద్ర ప్రభుత్వ నిధులేనని సంజయ్ చెప్పుకోవడం ఆయన అవగాహన రాహిత్యానికి నిదర్శనమని అన్నారు. 15వ ఆర్థిక సంఘం నిధుల్లో జడ్పీకి 20శాతం ఇవ్వాల్సి ఉండగా మోదీ సర్కార్ ఐదు శాతానికి తగ్గించిందని, దీనిపై ఏనాడైనా సంజయ్ మాట్లాడాడా అని ప్రశ్నించారు.


కన్నెపల్లి నుంచి సారలమ్మను తీసుకొస్తున్న ప్రధాన పూజారి కాక సారయ్య


భక్తులతో కిక్కిరిసిన వనదేవతల గద్దెల ప్రాంగణం


జంపన్నవాగు వద్ద యాట మొక్కులు చెల్లిస్తున్న భక్తులు


జాతరలో జాతకాలు చెబుతున్న కోయదొరలు


జంపన్నవాగులో పుణ్యస్నానమాచరిస్తున్న భక్తులు

ఆంధ్రజ్యోతి వన-జన జాతర February 21-24 2024

మేడారం.. జన సంద్రం..

- లక్షలాదిగా తరలివచ్చిన భక్త జనం
- కిటకిటలాడుతున్న జాతర ప్రాంగణం
- సారలమ్మ రాకతో మొదలైన మహాజాతర
- ప్రశాంతంగా ముగిసిన తొలి ఘట్టం


సమ్మక్క గద్దె

మేడారం బృందం, ఫిబ్రవరి 21: జనం.. జనం ప్రభంజనం. ఎటు చూసినా భక్త జన సంద్రం. అన్ని దారులు మేడారం వైపే.. పలు మార్గాల గుండా లక్షలాది భక్తులు మేడారానికి పోటెత్తుతున్నారు. దీంతో బుధవారం రాత్రి వరకు మేడారం పరిసరాలు జనజాతరయ్యాయి. భక్తుల తాత్కాలిక గుడారాలు, చిరువ్యాపారుల అంగళ్లతో సందడిగా మారింది. జాతరకు ఇప్పటికే కోటిమంది వరకు భక్తులు వచ్చినట్టు ప్రాథమిక అంచనా కాగా గురువారం సాయంత్రానికి మరో 50లక్షల మంది వరకు రావొచ్చనని బావిస్తున్నారు. నెలరోజులుగా మేడారానికి వస్తూ ముందస్తు మొక్కులు చెల్లించుకున్న భక్తులు కాక వీరు అదనమని అధికారులు చెబుతున్నారు. ఇక జాతరలో తొలిఘట్టమైన సారలమ్మ రాక.. బుధవారం సాయంత్రం జరగ్గా.. సాయంత్రానికి ఒక్కసారిగా భక్తుల తాకిడి పెరిగింది. ఈ నేపథ్యంలో పోలీసులు మరింత అప్రమత్తమయ్యారు. మేడారంలోకి ప్రవేశించే అన్ని మార్గాల వద్ద మోహరించి.. వాహనాలను నియంత్రిస్తున్నారు. ఎడ్ల బండ్లు, ట్రాక్టర్లు, డీసీఎంలు, లారీలు, కార్లు, ఆటోలు తదితర వాహనాల్లో వస్తుండగా.. డ్యూటీ, ప్రత్యేక పాస్‌లున్న కొన్ని వాహనాలను మాత్రమే మేడారంలోకి అనుమతిస్తున్నారు. దీంతో ప్రైవేటు వాహనాల్లో వచ్చే వారంతా మేడారానికి ఐదు కిలో మీటర్ల దూరంలోని పార్కింగ్ ప్రాంతాల నుంచి మూటాముల్లెలతో కాలినడకన గద్దెలకు చేరుకుంటున్నారు.

దూరప్రాంతాల నుంచి..

తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, ఛత్తీస్‌ఘడ్, ఒడిశా తదితర రాష్ట్రాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తున్నారు. జాతర సమయంలోనే సమ్మక్క, సారలమ్మలను దర్శించుకోవాలని తపించే లక్షల మంది మంగళవారం నుంచి మేడారం బాటపట్టారు. వాహనాలు, బస్సులు, ఎడ్ల బండ్లలో తరలివచ్చి మేడారం చుట్టుపక్కల విడిది చేశారు. దీంతో మేడారానికి ఎటు చూసినా 20 కి.మీ. వరకు భక్తుల సందోహమే కనిపిస్తోంది. వనం అంతా జన మైంది.



వనదేవతల రాకతో..

బుధవారం రాత్రి సారలమ్మ రాకతో వనం పులకించిపోయింది. రాత్రి కన్నెపల్లి నుంచి సారలమ్మను ప్రధాన పూజారి కాక సారయ్య జయజయధ్వానాల మధ్య తీసుకొచ్చారు. అలాగే పూనుగొండ్ల నుంచి మంగళవారం బయలుదేరిన పగిడిద్దరాజు బుధవారం మేడారానికి చేరుకున్నారు. కొండాయి నుంచి గోవిందరాజులు, నాగులమ్మ గద్దెలకు చేరుకోవడంతో భక్తుల మొక్కులు ప్రారంభమయ్యాయి.


జంపన్నవాగు నుంచి గద్దెల వద్దకు వచ్చే దారిపై భక్తజనం రద్దీ



టీ-వర్క్‌ను సందర్శించిన జిల్లా విద్యార్థులు


క్లాత్ ఫోల్డింగ్ పరికరం ప్రదర్శన

సిరిసిల్ల రూరల్, ఫిబ్రవరి 21:జిల్లాలో ఇన్‌స్పైయిర్, సైన్స్ ఫెయిర్‌కు జాతీయ స్థాయికి ఎంపికైన 19 ఎగ్జిబిట్‌లను హైదరాబాద్‌లోని టీవర్క్, టీహబ్‌లలో విద్యార్థులు ప్రదర్శించారు. జిల్లా సైన్స్ అధికారి పాముల దేవయ్య ఆధ్వర్యంలో ఎగ్జిబిట్‌లకు ఎంపికైన 19 మంది విద్యార్థులతోపాటు వారికి సహకరించి గైడ్ టీచర్‌లు హైదరాబాద్‌లోని టీవర్క్స్, టీహబ్‌లను బుధవారం సందర్శించారు. ఉపాధ్యాయులు పాకాల శంకర్‌గౌడ్, అజ్జు నాయక్, భాస్కర్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, సంపత్, యాదరవి, వెంకటేష్, రాజేష్ పాల్గొన్నారు.

వృద్ధుల విహార యాత్ర



విహారయాత్రకు వెళ్తున్న వృద్ధులు

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 21: ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని వృద్ధుల డే కేర్ సెంటర్‌కు చెందిన వృద్ధులు ప్రభుత్వం, సహాయ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో బుధవారం విహారయాత్రకు బయలుదేరి వెళ్లారు. గంభీరావుపేట మండలంలోని ఎగువ మానేరు అందాలు, పరిసరాలను తిలకించారు. అనంతరం వనభోజనాలు చేశారు. ప్రభుత్వం, కలెక్టర్ అనురాగ్ జయంతి ఆదేశాల మేరకు వృద్ధుల వినోదం కోసం ప్రతీ బుధవారం సందర్శక ప్రాంతానికి తీసుకెళ్తున్నట్లు జిల్లా సంక్షేమ శాఖ అధికారి లక్ష్మీరాజం పేర్కొన్నారు.

పదోతరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్ల పంపిణీ

ముస్తాబాద్, ఫిబ్రవరి 21: ముస్తాబాద్ పోతుగల్ గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పదోతరగతి విద్యార్థులకు ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపక బృందం పరీక్ష ప్యాడ్లను అందజేసింది. మండలంలోని అన్ని పాఠశాలల విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లను అందించనున్నట్లు ప్రిన్స్‌పాల్ జ్ఞానాచారి తెలిపారు. ప్రభుత్వ విద్యాసంస్థలను కాపాడుకోవాలని పేర్కొన్నారు. అధ్యాపకులు సీహెచ్ రాజు,గంగల్ల నర్సింలు, విజయ్ కుమార్, మురళి, ప్రవీణ్, బి రాజు, మహేశ్, సునీత, వినీత, మంజుల పాల్గొన్నారు.

లంబాడ హక్కుల పోరాట సమితి జిల్లా కార్యవర్గం

సిరిసిల్ల టౌన్, ఫిబ్రవరి 21 : లంబాడ హక్కుల పోరాట సమితి జిల్లా నూతన కార్యవర్గాన్ని. బుధవారం సిరిసిల్ల పట్టణంలో జిల్లా ముఖ్యనాయకుల సమావేశంలో ఎన్నుకున్నారు. లంబాడ హక్కుల పోరాట సమితి రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడిగా భూక్య గజన్‌లాల్, ప్రధాన కార్యదర్శి గా గురు బాబు, ఉపాధ్యక్షులు గాభాస్కర్, బాదావత్ గోవర్ధన్, కార్యదర్శులుగా లకావత్ రాములునాయక్, విఠల్‌నాయక్, భూపతినాయక్, ప్రవీన్‌నాయక్, మదన్‌నాయక్, పరుశురాంనాయక్, చిన్‌రెడ్డి సంతోష్, ప్రకాష్, మునియా, మహేష్, మదన్‌లాల్ ఎన్నికయ్యారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

రుద్రంగి, ఫిబ్రవరి 21: రుద్రంగి మండల కేంద్రంలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన మండల కేంద్రంలోని షరీఫా, చిట్టిపాక మల్లవ్వ, బాస నారాయణ, గుగులోత్ పూల్ సింగ్ బాధిత కుటుంబాలను బుధవారం ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పరామర్శించారు. ఆయన వెంట గడ్డం శ్రీనివాస్ రెడ్డి, మాడిశెట్టి అభిలాష్, అల్లూరి సంతోష్ రెడ్డి, స్వర్గం పరంధాములు, గంధం మనోజ్, తదితరులు పాల్గొన్నారు.

వక్ఫ్ బోర్డు చైర్మన్‌కు అభినందనల వెల్లువ


అభినందిస్తున్న ఉమేష్‌రావు, నాయకులు

గంభీరావుపేట, ఫిబ్రవరి 21: రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్‌గా గంభీరావు పేటకు చెందిన సయ్యద్ అజ్మతుల్లా హుస్సేనీ బుధవారం హైదరాబాద్‌లో ప్రమాణ స్వీకారం చేశారు. 1999-2000లో నిజాం కాలేజీలో ఎన్‌ఎస్‌యూఐ యూనిట్ ప్రెసిడెంట్‌గా కాంగ్రెస్‌తో అజ్మతుల్లా తన అనుబంధం ప్రారంభించారు. రాష్ట్ర ఎన్‌ఎస్‌యూఐ కార్యదర్శిగా ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు. 2002-2006 వరకు ఎన్‌ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడిగా పనిచేసి, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి నుంచి జాతీయ కార్యదర్శిగా ఎదిగారు. 2016 నుంచి 2021 యూత్ కాంగ్రెస్ జాతీయ కార్యదర్శిగా, జాతీయ అధికార ప్రతినిధిగా పనిచేశారు. ప్రస్తుతం పీసీసీ ప్రచార కమిటీ కన్వీనర్‌గా కొనసాగుతున్నారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో అధిష్ఠానం సూచనలతో పలు రాష్ట్రాలకు పార్టీ ఎన్నికల ఇన్‌చార్జిగా వ్యవహరించారు. 25 ఏళ్లుగా కాంగ్రెస్ పటిష్ఠతకు కృషి చేస్తున్నారు. రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్‌గా నియామకమైన ఆయనను పలువురు జిల్లావాసులు అభినందనలు తెలిపారు.

● రాష్ట్ర వక్ఫ్‌బోర్డు చైర్మన్ అజ్మతుల్లా హుస్సేనీని గంభీరావుపేట మండలం ముస్తాఫనగర్‌కు చెందిన ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ సంక్షేమ సంఘం రాష్ట్ర కో ఆర్డినేటర్ ప్రవీణ్‌కుమార్ బుధవారం కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి సన్మానించారు.

సిరిసిల్ల టౌన్: వక్ఫ్‌బోర్డు చైర్మన్‌గా నియామకమైన సయ్యద్ అజ్మతుల్లా హుస్సేన్‌ను బుధవారం హైదరాబాద్‌లో టీపీసీసీ అధికార ప్రతినిధి చీటి ఉమేష్‌రావు, జిల్లా కాంగ్రెస్ నాయకులు కలిశారు. ఈ సందర్భంగా అభినందనలు తెలిపారు. నాయకులు ఓరగంటి తిరుపతి, పెద్దిగారి శ్రీనివాస్, భూపాల్‌రెడ్డి, బాలరాజు, వెంకట్‌రెడ్డి, రాజశేఖర్, మల్లేశ్‌బాబు, నాగరాజు, మహిపాల్, కిషన్, మల్లేశం పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట: అజ్మతుల్లహుస్సేన్‌ను హైదరాబాద్‌లోని హజ్ భవన్‌లో బుధవారం కాంగ్రెస్ నాయకులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో నాయకుడు గౌస్ తదితరులు ఉన్నారు.

ముస్తాబాద్: రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ అజ్మాతుల్లా హుస్సేన్‌ను ముస్తాబాద్ మాజీ సర్పంచ్ ఒరగంటి తిరుపతి, డీసీసీ జనరల్ సెక్రెటరీ పెద్దిగారి శ్రీనివాస్ బుధవారం హైదరాబాద్‌లో కలిశారు. నూతనంగా నియామక మైన సందర్భంగా పుష్ప గుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

వస్త్ర పరిశ్రమలో సంక్షోభాన్ని నివారించాలి



సిరిసిల్లలో మాట్లాడుతున్న రమేష్

సిరిసిల్ల రూరల్, ఫిబ్రవరి 21 : సిరిసిల్ల వస్త్ర పరిశ్రమలో సంక్షోభాన్ని రాష్ట్ర ప్రభుత్వం నివారించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 28న మహాధర్నా చేపట్టనున్నట్లు సీపీఎం జిల్లా కార్యదర్శి మూషం రమేష్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని బీవైనగర్ సీఐటీయూ కార్యాలయంలో తెలంగాణ పవర్‌లూం వర్కర్స్ యూనియన్, అనుబంధ రంగాల యూనియన్‌ల ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిరిసిల్లలో వస్త్ర పరిశ్రమ తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయిందని యజమానులు పరిశ్రమలను బంద్ చేస్తున్నారన్నారు. దీనిపైన ఆధారపడిన ఆసాములు, మరమగ్గాల కార్మికులతోపాటు అనుబంధ రంగాల కార్మికులు రోడ్డున పడ్డారన్నారు. రోజురోజుకు పరిస్థితి క్లిష్టతరంగా మారుతోందన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో రాష్ట్ర ప్రభుత్వం బతుకమ్మ చీరల ఆర్డర్‌లు ఇవ్వాలని, బకాయిలను విడుదల చేయాలని కోరారు. సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎల్లారెడ్డి, కోడం రమణ, ఎలిగేటి రాజశేఖర్, వార్పిన్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు సిరిమల్ల సత్యం, వైపని వర్క ర్స్ యూనియన్ కార్యదర్శి ఆడెపు సంపత్, జాఫర్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు తడుక శివకుమార్, పవర్‌లూం వర్కర్స్ యూనియన్ నాయకులు మోర తిరుపతి, గడ్డం రాజశేఖర్, సందుపట్ల పోచమల్లు పాల్గొన్నారు.

కన్నుల పండువగా శోభాయాత్ర

కరీంనగర్ కల్చరల్, ఫిబ్రవరి 21: జిల్లా కేంద్రంలోని మార్కెట్‌రోడ్ శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం శ్రీవారి శోభాయాత్రను నేత్రపర్వంగా నిర్వహించారు. మార్క్‌ఫెడ్ గ్రౌండ్ వద్ద శోభాయాత్ర ప్రారంభం కాగా గరుడ వాహనంతో కూడిన ప్రత్యేక రథంపై వేంకటేశ్వరస్వామి అందరికీ కనువిందు చేశారు శ్రీవారికి మంత్రి పొన్నం ప్రభాకర్ ఫలాలు సమర్పించి పూజలు నిర్వహించారు. మార్క్‌ఫెడ్ గ్రౌండ్ వద్ద ప్రారంభమైన యాత్ర రాంనగర్, మంకమ్మతోట, తెలంగాణచౌక్, బస్టాండ్, టూటౌన్ పోలీస్ స్టేషన్ ద్వారా ఆలయానికి చేరుకుంది. పూజల అనంతరం మంత్రి పొన్నం స్వయంగా ట్రాక్టర్ (రథం) నడపుతూ, నగారా మోగిస్తూ అందరినీ ఉత్సాహ పరిచారు. యాత్రలో శ్రీవారి శేష, చంద్రప్రభ, సూర్యప్రభ, గజ, సింహ, కల్పవృక్ష, అశ్వ, హనుమంత వాహనాలు పాల్గొన్నాయి. ఎనిమిది గుర్రాలు, నాటులు ఒంటెలు, నంది కోల, ఘటం, నగారా, ఒగ్గుడోలు, మహిళలు, పురుషుల డప్పులు, గుస్సాడి, గోమాతలు, బోనాలు, కేరళ మేళం, చిరుతల భజన, బంజారా, అఘోరా, మహంకాళి, స్థానిక కళాకారుల ప్రదర్శనలు, తమ్మళ సొన్నాయి, నాదస్వరం బృందాలు కనువిందు చేశాయి.

● **భక్తజన నీరాజనం..**

తిరుమలలో మాదిరి జరిగిన శోభాయాత్రను తిలకించేందుకు భక్తులు, ప్రజలు పెద్దఎత్తున తరలివచ్చారు. యాత్రలో పాల్గొని భజనలు, గోవిందనామస్మరణలు చేస్తూ భక్తిపారవశ్యంలో మునిగి తేలారు. మహిళలు మంగళహారతులు పట్టి స్వాగతం పలికారు. కార్యక్రమంలో మానకొండూరు ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపెల్లి సత్యనారాయణ, పీసీసీ రాష్ట్ర కార్యదర్శి వైద్యుల అంజన్‌కుమార్, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి పురుమల్ల శ్రీనివాస్, నగర అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, ఎన్‌ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు అనిల్, నాయకులు ఆకారపు భాస్కర్‌రెడ్డి, మల్లికార్జున రాజేందర్, కటకం వెంకటరమణ, వెలిచాల రాజేందర్‌రావు, సంగీతం శ్రీనివాస్, నార్ల కార్తిక్, జక్కుల మల్లేశం, పద్మాకర్‌రెడ్డి, భాస్కర్, దేవాదాయశాఖ సహాయ కమిషనర్ చంద్రశేఖర్, ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ పి సత్యనారాయణ, ఆలయ వంశపారంపర్య ధర్మకర్తలు చకిలం శ్రీనివాస్, చకిలం గంగాధర్, ఈవో వుడుతల వెంకన్న పాల్గొన్నారు.

లక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో ఎమ్మెల్యే పూజలు


ప్రసాదం అందజేస్తున్న ఆలయ అధికారులు

వేములవాడ రూరల్, ఫిబ్రవరి 21: మండలంలోని నాంపెల్లి లక్ష్మీనరసింహస్వామిని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ బుధవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అర్చకులు ఆశీర్వచనం, అధికారులు స్వామివారి ప్రసాదాన్ని అందజేశారు. అంతకుముందు ఆలయ అధికారులు ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌కు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు.

అర్బన్ పార్కు ప్రారంభానికి ముందస్తు చర్యలు

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 21:ఎల్లారెడ్డిపేట మండలం హరిదాస్‌నగర్ శివారులో నిర్మించిన అర్బన్ పార్కు ప్రారంభానికి అటవీ శాఖ అధికారులు బుధవారం ముం దస్తు చర్యలు చేపట్టారు. పార్కులో సందర్శకులకు అనుమతి కల్పించేందుకు ఏర్పాట్లు చేశారు. సందర్శకులు ఎంత మంది వస్తున్నారు? పార్కులో కల్పించాల్సిన వస తులపై అంచనా వేసేందుకు ప్రణాళికలు తయారు చేయనున్నామని ఎఫ్‌ఆర్వో శ్రీనివాస్‌రావు పేర్కొన్నారు. నెల రోజులపాటు సందర్శకులకు అనుమతి కల్పించి పూర్తి స్థాయిలో ప్రారంభానికి సిద్ధం చేయనున్నామని తెలిపారు.

డీసీఆర్‌బీ డీఎస్పీ భీంరెడ్డి బదిలీ

- డీసీఆర్‌బీ డీఎస్పీగా ప్రణీత్‌కుమార్

సిరిసిల్ల క్రైం, ఫిబ్రవరి 21: జిల్లా డీసీఆర్‌బీ డీఎస్పీ ఎస్. భీంరెడ్డి బదిలీ అయ్యారు. ఇటీవల సిరిసిల్లకు పోస్టింగ్ ఇచ్చినప్పటికీ ఆయన ఇక్కడ జాయిన్ కాకుండానే మళ్లీ బదిలీ అయ్యారు. సిరిసిల్ల నుంచి పీసీఎస్‌కు బదిలీ అయ్యారు. సిరిసిల్లకు డీసీఆర్‌బీ డీఎస్పీగా డి.ప్రణీత్‌కుమార్‌కు పోస్టింగ్ ఇచ్చారు.

బీజేపీ కార్యకర్త కుటుంబానికి ఆర్థిక సహాయం

కోనరావుపేట, ఫిబ్రవరి 21 : కోనరావుపేట మండలం కొండాపూర్ గ్రామంలో బిజెపి కార్యకర్త రమేష్ మృతి చెందగా ఆయన కుటుంబానికి బీజేపీ నాయకులు ఆర్థిక సహాయాన్ని బుధవారం అందజేశారు. కనగర్తి బిజెపి గ్రామ శాఖ ఆధ్వర్యంలో 10 వేల రూపాయల ఆర్థిక సహాయంతో పాటు 50 కిలోల బియ్యాన్ని అందజేశారు. ఈ సందర్భంగా బిజెపి మండల అధ్యక్షుడు గొట్టె రామచంద్రం, బెంద్రె శ్రీనివాస్, కనగర్తి కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడి మృతికి సంతాపం

వీర్నపల్లి, ఫిబ్రవరి 21 : వీర్నపల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు తీగల దేవేందర్‌గౌడ్ (48) అనారోగ్యంతో బుధవారం మృతి చెందాడు. ఉపాధ్యాయుడి మృతితో ఉపాధ్యాయులు, విద్యార్థులు సంతాపం వ్యక్తం చేశారు. అనంతరం పాఠశాలకు సెలవు ప్రకటించారు. దేవేందర్ గత ఐదు సంవత్సరాలుగా పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేస్తూ పలువురి మన్ననలు పొందాడు. టీఎస్‌యూటీఎఫ్, పీఆర్‌టీయూ సంతాపం ప్రకటించాయి.

గుండెపోటుతో డిగ్రీ విద్యార్థి మృతి

ముస్తాబాద్, ఫిబ్రవరి 21: మండలంలోని పోతుగల్ గ్రామానికి చెందిన ఓ డిగ్రీ విద్యార్థి గుండెపోటుతో మరణించాడు. పోతుగల్ గ్రామానికి చెందిన వరిలత, రాజుకు ఇద్దరు కుమారులు. చిన్నవాడైన్ చంద్రమోహన్ హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు కళాశాలలో డిగ్రీ చదువుతు న్నాడు. అనారోగ్యంతో ఇంటికి వచ్చిన చంద్రమోహన్ ఇంట్లోని బాత్‌రూంలో తెల్లారేసరికి విగతజీవుడయ్యాడు. గుండెపోటుతో మరణించినట్లు కుటుంబసభ్యులు భావిస్తున్నారు.

10వ తరగతి విద్యార్థులకు టాలెంట్ టెస్టు

కోనరావుపేట, ఫిబ్రవరి 21 : కోనరావుపేట మండలం సుద్దాల ప్రభుత్వ పాఠశాలలోని 10వ తరగతి విద్యార్థులకు ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మల్లారపు ప్రశాంత్, ఉపసర్పంచ్ ఎరవెల్లి నాగరాజు మాట్లాడుతూ రాబోయే పబ్లిక్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ఈ టాలెంట్ టెస్టులు దోహదపడతాయని అన్నారు. అంతేకాకుండా విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీయడానికి ఉపయోగపడతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎంసీ చైర్మన్ ఎర్రవెల్లి విజయ్, భీమ్ ఆర్మీ జిల్లా అధ్యక్షుడు బొడ్డు ప్రవీణ్, హెచ్ఎం, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.